క్లుప్తంగా

నిర్మాణాలు పూర్తి చేయండి

అంబాజీపేట: ప్రాథమిక పాఠశాలల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. చిరతపూడి శివారు చిట్టిచెరువు గట్టు వద్ద పాఠశాల భవన నిర్మాణాన్ని గురువారం ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీ నేతల నాగరాజు పరిశీలించారు. చిట్టిచెరువు గట్టు వద్ద అద్దె భవనంలో నిర్వహిస్తున్న పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

శరవేగంగా పనులు

ఆలమూరు: స్థానికంగా రూ.మూడు కోట్లతో శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను పార్టీలకు అతీతంగా మండల శెట్టిబలిజ సమాఖ్య గురువారం పరిశీలించింది. జిల్లా ఎక్కడా లేని విధంగా స్థానిక పెద్ద కాలువ రోడ్డులో సువిశాలమైన 50 సెంట్ల భూమిలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి శెట్టిబలిజ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. నేతలు యనమదల నాగేశ్వరరావు, వసుం సూరిబాబు, కట్టా రామకృష్ణ, కాలా సాయిబాబా పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

ఆలమూరు: కొత్తూరు నుంచి వివిధ గ్రామాల మీదుగా విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండపేట నుంచి కొత్తూరు మీదుగా కపిలేశ్వరపురం బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ మేరకు రావులపాలెం ఆర్టీసీ డిపో డిప్యూటీ మేనేజర్ అచ్యుతాంబకు వినతి అందజేశారు.

స్తంభాన్ని ఢీకొన్న లారీ

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారి మడికి వద్ద సీసీ కెమెరా స్తంభాన్ని మినీ లారీ ఢీకొంది. రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపునకు వెళుతున్న లారీ స్థానిక క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకువెళ్లి సీసీ కెమెరా స్తంభాన్ని ఢీకొంది. దీంతో సీసీ కెమెరా వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది.

శ్రమదానంతో రోడ్డు బాగు

మామిడికుదురు: గోదావరి వరదలతో దెబ్బతిన్న బి.దొడ్డవరం ఆర్‌అండ్‌బీ రోడ్డును గురువారం స్థానికులు శ్రమదానంతో బాగు చేశారు. సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి అగాధంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్థానికులు శ్రమదానం ద్వారా సీసీ రోడ్డుకు బెర్మ్‌లు ఏర్పాటు చేశారు.

సభ విజయవంతానికి పిలుపు

ఆలమూరు: ఎస్సీ వర్గీకరణ బిల్లును వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరుతూ హైదరాబాద్‌లో ఈ నెల రెండో వారంలో మరో విశ్వరూప మహాసభ నిర్వహించనున్నామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, కార్యదర్శి కె.నూకరాజు తెలిపారు. పెదపళ్లలో నేత కొమ్ము నారాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

కొత్తపేట: బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వాడపాలేనికి చెందిన సోదరులు సాధనాల శివాజీ, విజయ్‌లు కొత్తగా భవనాలు నిర్మించుకుంటున్నారు. వీటికి సీలింగ్, పెయింటింగ్ పని నిమిత్తం యర్రంశెట్టి గణేష్‌తో రేటు మాట్లాడుకుని రూ.3 లక్షలు ఇచ్చారు. కొన్ని రోజులుగా పనిచేయడానికి రాకపోవడంతో బిల్డింగ్ యజమాని శివాజీ వెళ్లి నిలదీయడంతో గణేష్ దుర్భాషలాడుతూ బెదిరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తపేట: స్థానిక 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్తు అంతరాయం కలుగుతుంది. కొత్తపేట పంచాయతీ పరిధిలో అన్ని ప్రాంతాలకు, వాడపాలెం, అవిడి, మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు విద్యుత్ ఉండదని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

మృతికి సంతాపం

సఖినేటిపల్లి: మోరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వి.నీలావతి ఇటీవల మృతి చెందగా సంస్మరణ సభను యూటీఎఫ్ సంఘ మండల శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. సంఘ కుటుంబ సంక్షేమ పథకం నుంచి ఆమె కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ శంకరరావు అందజేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మామిడికుదురు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్, డాక్టర్ బసవా వరహాలు సూచించారు. స్థానిక బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో గురువారం మాతా శిశు సంరక్షణ, బాలింతల ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏడిద కవీంద్ర అధ్యక్షతన జరిగిన సభలో వరహాలు మాట్లాడారు. అనంతరం గర్భిణులకు పోషకాహారం అందించారు.

ఆలమూరు: తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని పెనికేరు సబ్ సెంటర్‌లో ఎంపీహెచ్‌ఏ టి.సుశీల ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిగాయి. సర్పంచ్ వసుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి తదితరులు గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, నూతన వస్త్రాలను అందజేశారు.

మేమున్నామని.. మీకేం కాదని..

- వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ
- భరోసా అందిస్తున్న ప్రభుత్వం



వానపల్లి శివారు నారాయణలంకలో వరద బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



ఊడిమూడిలంకలో బాధితులకు సరకులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

కొత్తపేట: వరద ఉప్పెనలా వచ్చింది.. లంకలను చుట్టేసింది.. పేదల జీవితాన్ని చిన్నాభిన్నం చేసింది.. అలాంటి సమయంలో మేమున్నామని, మీకేం కాదని ప్రభుత్వం కొండంత భరోసా ఇచ్చింది.. సహాయక చర్యలు ముమ్మరం చేసింది. దాతలూ ముందుకు వచ్చి తమకు తోచిన సాయం చేస్తూ ఉదారత చాటుతున్నారు. వరద బాధితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలిచిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం వానపల్లి శివారు లంక గ్రామాల్లో వరద బాధితులను ఆయన పరామర్శించారు. నారాయణలంకలో 89 వరద బాధిత కుటుంబాలకు, సత్తెమ్మలంకలో 104 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో కందిపప్పు చొప్పున, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేశారు. మండలంలో 290 మందికి మంజూరైన రైస్ కార్డులను ఆయా ప్రాంతాల్లో జగ్గిరెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణం స్పందించి జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పుడు నిత్యావసరాలతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.2 వేల చొప్పున ఈ రెండు లంక గ్రామాల్లో 193 కుటుంబాలకు రూ.3.86 లక్షలు బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందన్నారు. లంక భూముల్లో దెబ్బతిని నష్టం వాటిల్లిన పంటల నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, పాల్గొన్నారు.

పి.గన్నవరం: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల్లో వరద బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో ఉల్లి, కిలో బంగాళాదుంపలు, కిలో కందిపప్పు చొప్పున అందజేశారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, నాయకులు సాధనాల రమేష్, కత్తుల విక్టర్, నేతల శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

అయినవిల్లి: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, నిత్యావసరాలను వరద బాధితులకు సక్రమంగా పంపిణీ చేయాలని జేసీ ఎస్.నూపుర్ అజయ్ అధికారులను, రేషన్ డీలర్లను ఆదేశించారు. వీరవల్లిపాలెంలోని వరద బాధితుల ఇళ్లకు వెళ్లి సరకుల పంపిణీపై అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ ఇచ్చి..



దుర్గకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ అశోక్

అంబాజీపేట: అనారోగ్యం కారణంగా విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగలకుర్రుకు చెందిన కోలా దుర్గ వద్దకు వలంటీర్ చిట్టూరి అశోక్ వెళ్లి రూ.10 వేల పింఛను సాయం గురువారం పంపిణీ చేశారు. అశోక్‌ను జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి పండు, పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవతి తదితరులు అభినందించారు.

వలంటీర్‌కు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అమలాపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిరుతపూడికి చెందిన వలంటీర్ సామంతకుర్రు సతీష్, అతని భార్యను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు పరామర్శించారు. ఈ నెల 2న బైక్‌పై తన భార్యతో అంబాజీపేట వెళ్తుండగా ఇసుకపూడి వద్ద ట్రాక్టర్ ఢీకొంది. భార్యాభర్తలిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారా చిట్టిబాబు, కడలి రాము తదితరులు పరామర్శించారు.

'శాశ్వత భూ హక్కు'తో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



కొత్తపేటలో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: భూ సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే దోహదపడుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద గంటి, మందపల్లి, వాడపాలెం, వానపల్లి ఖండ్రిగ గ్రామాల్లో 1,220 మందికి శాశ్వత భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. స్థానిక సీహెచ్‌సీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల వారీగా భూ సరిహద్దులను కచ్చితత్వంతో కొలిచి భూ యజమానులకు అప్పగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, పీఎస్‌సీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు, తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

- స్థానిక సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవలు, అవసరాలు తదితర అంశాలపై సమీక్షించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నాడు– నేడు కింద ఆస్పత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేశామన్నారు. ఉత్తమ వైద్య సేవలతో ఆస్పత్రిని గ్రేడ్ –1 స్థాయికి తీసుకురావాలని వైద్య సిబ్బందికి సూచించారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఎస్‌సీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మునునూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత

రావులపాలెం: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక సత్యసాయి విద్యాసంస్థల ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాభివృద్ధికి కళాశాలల డైరెక్టర్ రవిచంద్ర చేస్తున్న కృషిని కొనియాడారు. చాంబర్ అధ్యక్షుడు నాగిరెడ్డి, సర్పంచ్ కర్రి గోవింద కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో మైలురాయి 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



అంబాజీపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన నుంచి వచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలను నేరుగా అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఆశించిన లక్ష్యాన్ని చేరుకుందన్నారు. పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో ఈ కార్యక్రమం ద్వారా వలంటీర్లు, సచివాలయ, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు బృందాలుగా ప్రతి ఇంటికీ వెళ్లి 11 రకాల సర్టిఫికెట్ల జారీకి సర్వే చేశారన్నారు. మొత్తం నియోజకవర్గంలో 62 గృహాలను సందర్శించి 90 వేల ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. కలసికట్టుగా సాగడంతోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, గుత్తుల నాగబాబు, కొర్లపాటి కోటబాబు, ఉందుర్తి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంత సమాజ స్థాపనకు కృషి

పి.గన్నవరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా పి.గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఆయన టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వై.విజయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. తల్లీ, పిల్లల ఆరోగ్య సంరక్షణకు సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని 301 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1618 మంది గర్భిణులు, 1393 మంది బాలింతలకు రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్టు సీడీపీఓ విజయశ్రీ తెలిపారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ భారతి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పి.చినవెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. తొలుత దివంగత మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాపాక మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.60 కోట్లతో వివిధ రోడ్ల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో కొత్తగా మంజూరైన రూ.32 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా ప్రతిపక్ష నాయకులు పెట్టుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఎంపీడీవో జి.భీమారావు శాఖల వారీగా సమీక్ష చేశారు. గ్రామాల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ వై.రామకుమారికి ఎంపీపీ విజ్ఞప్తి చేశారు. మండలంలో అభివృద్ధి పనులకు మార్కెట్ యార్డు నుంచి నిధులు మంజూరు చేయించాలని రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణిని కోరారు. అంతర్వేది దేవస్థానంలో ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీటీసీ బైర నాగరాజు అన్నారు. పీఆర్ డీఈఈ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ సకాలంలో వీటిని పూర్తి చేస్తామన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, ఎంఈవో–1 డి.కిశోర్‌కుమార్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, కోఆప్షన్ సభ్యుడు బళ్ల నోబుల్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, పీఏసీఎస్ అధ్యక్షులు రుద్రరాజు రంగరాజు, ముప్పర్తి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో మాదిగలకు గుర్తింపు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ మాత్రమే మాదిగలకు గుర్తింపు ఇచ్చిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గురువారం పాశర్లపూడి కొట్టుమెరకలో మాదిగ పేటలో ఆయన పర్యటించారు. అక్కడ మహిళలు, యువకులతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ మాదిగలకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల్లో మాదిగలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. నాయకులు కొమనాపల్లి శ్రీను, తవిటికి భాను, తొత్తరమూడి వంశీ, మార్గపూడి సత్యవతి, కొమనాలపల్లి పార్వతి, శెట్టెం మరియమ్మ, చుట్టుగుళ్ల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకూ సమన్యాయమే లక్ష్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- విశ్వేశ్వరాయపురంలో గడప గడపకూ..



విశ్వేశ్వరాయపురంలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ సమన్యాయం జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం విశ్వేశ్వరాయపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని అన్నారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. దీనికోసం అవసరమైన భూమి కొనుగోలుకు నిధులను కూడా అందిస్తుందన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నాయకులు చింతా రాజబాబు, గుబ్బల వీరవెంకట సత్యనారాయణ, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, పెయ్యల చిట్టిబాబు, కూనపరెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

6న ప్రతిభావంతులకు పురస్కారాలు

మామిడికుదురు: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ నెల 6న ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని సంఘ మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్‌బాబు గురువారం తెలిపారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో 2022–23లో మండల స్థాయిలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో గ్రామాల వారీగా ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించి మెమెంటోలతో పాటు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.

డిజిటల్ బోధనకు శ్రీకారం

ఆలమూరు: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అన్నారు. చెముడులంక ఎస్టీఎస్ ఎస్ఎం ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ డిజిటల్ తరగతి గదులను గురువారం ఆయన ప్రారంభించారు. పాఠశాలకు సంబంధించి ప్రభుత్వం 16 ఐఎఫ్‌పీ పరికరాలు మంజూరు చేయగా, ప్రస్తుతం 14 పరికరాలను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై సుద్ద ముక్కలతో పని లేకుండా, కేవలం ఐఎఫ్‌పీ సాంకేతిక బోధనా పద్ధతుల ద్వారా నాణ్యమైన బోధన జరుగుతుందన్నారు. పాఠశాల వ్యవస్థాపక వంశీకులు తిర్నాతి శ్రీనివాసు, నాయకులు దొండపాటి చంటి, దొండపాటి శ్రీను, మోటూరి సురేష్, సుంకర శ్రీనివాసు, హెచ్‌ఎం బి.శివరామకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



వక్కలంకలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రేవతి, పెదబాబు

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు పండించవచ్చని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో పీఎంఏజేఏవై పథకం కింద షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు, పనిముట్లు అందిస్తున్నారన్నారు.

సమీకృత దాణా పంపిణీ

కొత్తపేట: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వాడపాలేనికి చెందిన వరద ప్రాంత 54 మంది పాడి రైతులకు 2,250 కిలోల సమీకృత దాణాను బల్క్‌మిల్క్ సెంటర్ వద్ద అందించారు. దీనిని ఏఎంసీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా బాబ్జి పంపిణీ చేశారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

ఆత్రేయపురం: ఆయిల్ పామ్ రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి కోటేశ్వరరావు, సర్వే సాయి కంపెనీ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం ఆత్రేయపురంలో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం జరిగింది. సర్పంచ్ గెడ్డం సుధ, ఉద్యాన విస్తరణ అధికారి డి.వెంకటేశ్వరరావు, కంపెనీ సీఈఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



వరి చేలను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

రాజోలు/పి.గన్నవరం: మార్టేరు ఏరువాక శాస్త్రవేత్తల బృందం చింతలపల్లిలో గురువారం పర్యటించింది. ప్రధాన శాస్త్రవేత్త వి.గౌరి, పీబీ ప్రదీప్‌కుమార్, డాక్టర్ ఎ.ఆనంద్‌కుమార్‌ల బృందం వరి పొలాలను పరిశీలించింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు ముంపునకు గురైనట్టు గుర్తించారు. ముంపునీరు తొలగించుకునేందుకు తీసుకునే చర్యలను రైతులకు వివరించారు. ఆత్మ పీడీ డీడీఏ జ్యోతిర్మయి, ఏఓ మనోహర్, మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ బృందం పి.గన్నవరం మండలం మొండెపులంక, నాగుల్లంక తదితర గ్రామాల్లో వరద నీటిలో నానుతున్న వరిచేలను పరిశీలించింది.

ఆత్రేయపురం: వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసినట్టు ఉద్యానశాఖ అధికారి కోటేశ్వరరావు తెలిపారు. బొబ్బర్లంక, పేరవరం, వసంతవాడ, పులిదిండి తదితర లంక గ్రామాల్లో అరటి, కంద, బొప్పాయి, పసుపు, పూల తోటలకు నష్టం వాటిలినట్టు రైతులు అధికార్లకు వివరించారు.

పూర్వ విద్యార్థుల సాయం



మామిడికుదురు హైస్కూల్‌కు కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక గోకవరపు గణాధిపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు గురువారం వంద కుర్చీలు అందించారు. 1986–87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఇటీవల జరిగింది. తమకు విద్య నేర్పిన పాఠశాలకు తమ గుర్తుగా కుర్చీలు అందించాలని నిర్ణయించారు. అనుకున్న విధంగా కుర్చీలు కొనుగోలు చేసి తీసుకు వచ్చి వాటిని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నిరంజనికి అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువరానిదని ఆమె అన్నారు.

ఎంపీడీఓకు అభినందన



ఎంపీడీఓ నాతిబుజ్జిని అభినందిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

ఆత్రేయపురం: రాష్ట్ర పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం కన్వీనర్‌గా ఎంపికైన ఎంపీడీఓ నాతిబుజ్జిని సచివాలయ సిబ్బంది అభినందించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

చిన్నారుల రక్షణకు చట్టాలు

మామిడికుదురు: మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఐద్వా చేపట్టిన మహిళల పోరు యాత్ర గురువారం మామిడికుదురు చేరింది. దీప్తి స్కూల్ వద్ద సమావేశం జరిగింది. ఐద్వా సహాయ కార్యదర్శులు సత్యవతి, రమణి, పి.పూర్ణ పాల్గొన్నారు.